క్లుప్తంగా

బీమా తక్షణసహాయం అందజేత



మృతుడి భార్యకు నగదు అందజేస్తున్న సర్పంచ్, సచివాలయ కన్వీనర్లు

జామి: మండలంలోని చిల్లపాలెం గ్రామానికి చెందిన చిల్ల అప్పలనాయుడు ఇటీవల మృతి చెందారు. నామినీ, ఆయన భార్య కొండమ్మకు సర్పంచ్ జొన్నాడ వెంకటలక్ష్మి వైఎస్సార్ బీమా తక్షణసహాయం రూ.10 వేలు శుక్రవారం అందజేశారు. బీమా మిగతా మొత్తం నామినీ ఖాతాలో జమవుతుందని చెప్పారు. సచివాలయ కన్వీనర్లు మజ్జిహరికృష్ణ, సింగారపు అప్పలరాజు, ఉపసర్పంచ్ జొన్నాడ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి గోపాలకృష్ణ పాల్గొన్నారు.

పరామర్శ



సీతబాబు కుటుంబాన్ని పరామర్శిస్తున్న అగ్నిమాపకశాఖ డీజీపీ సునీల్‌కుమార్

చీపురుపల్లి: పట్టణానికి చెందిన ఏపీఈపీడీసీఎల్ అకౌంట్స్ ఆఫీసర్, ఎయిమ్ జిల్లా ఇన్‌చార్జి అడ్డూరి సీతబాబు తండ్రి అప్పారావు ఇటీవల మరణించారు. ఆయన కుటుంబాన్ని ఎయిమ్ వ్యవస్థాపకులు, అగ్నిమాపకశాఖ, విపత్తులు నిర్వహణ డీజీపీ పి.వి.సునీల్ కుమార్ శుక్రవారం పరామర్శించారు. అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.సీతబాబు కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో ఎయిమ్ జిల్లా కన్వీనర్ కెల్ల భీమారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.వి.రమణ, కో- కన్వీనర్లు ఎల్.లక్ష్మణరావు, డి.సూర్యనారాయణ, డి.జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో తనిఖీలు



వైద్యులతో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ గౌరీశంకర్

గజపతినగరం: స్థానిక ఏరియా ఆస్పత్రిలో జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి (డీసీహెచ్ఎస్) గౌరీశంకర్ శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఆస్పత్రిలోని అన్ని వార్డులను సందర్శించారు. రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. అలాగే మందుల నిల్వలు, రికార్డులను పరిశీలించారు. వైద్యసేవలపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ జగదీశ్వరరావు, వైద్యులు ఉన్నారు.

సీసీరోడ్లు, కాలువల నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లిరూరల్: మండలంలోని పి.కె.పాలవలస గ్రామంలో సిమెంట్ రోడ్లు, కాలువల నిర్మాణా నికి వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసుల నాయుడు, బెల్లాన వంశీకృష్ణ శుక్రవారం భూమిపూజ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో రోడ్లు, కాలువల నిర్మాణానికి విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ తన ఎంపీ ల్యాడ్ నిధుల నుంచి రూ.9.7 లక్షలు మంజూరు చేశారన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. నాయకులు ఇప్పిలి తిరుమల, రెల్లి శివకుమార్, బైరెడ్డి లక్ష్మణరావు, రెల్లి వెంకటేష్, పిసిని మోహన్‌రావు, బైరెడ్డి సూరిసత్యం తదితరులు పాల్గొన్నారు.

వివాదస్పద భూముల పరిశీలన



ఇరువర్గాలతో మాట్లాడుతున్న సీఐ బాలసూర్యారావు

వేపాడ: మండలంలోని వీలుపర్తి రెవెన్యూలో వివాదస్పద డీపట్టా భూములను ఎస్.కోట సీఐ బాలసూర్యారావు శుక్రవారం పరిశీలించారు. భూముల కు సంబంధించి ఇరువర్గాల వద్ద ఉన్న ఆధారాలతో పోలీస్ స్టేషన్‌కు రావాలని సీఐ సూచించారు. అనంతరం వావిలపాడు, వీలుపర్తి పంచాయతీ పరిధిలోని క్వారీలను పరిశీలించారు. వల్లంపూడి పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, రికార్డులను పరిశీలించి, కేసుల పరిష్కారంపై ఎస్ఐ రాజేష్‌ను ఆరా తీశారు.

ఆలయాలకు 'శ్రావణ' శోభ

- ఘనంగా శ్రావణమాస తొలి శుక్రవారం పూజలు



శృంగవరపుకోట: శాకంబరిగా దర్శనమిస్తున్న దుర్గమ్మ



చీపురుపల్లి: ప్రత్యేక అలంకరణలో రామలింగాపురంలో మానసాదేవి నాగశక్తి అమ్మవారు



చీపురుపల్లి: మానసాదేవి అమ్మవారి ఆలయంలో కుంకుమ పూజల్లో మహిళలు



చీపురుపల్లి: కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో కుంకుమ పూజలు



జామి: జామిలో పూజలందుకుంటున్న కన్యకాపరమేశ్వరి



చీపురుపల్లి: కస్పావీధి దుర్గాదేవి అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలు



బొండపల్లి: దేవుపల్లిలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



వేపాడ: బొద్దాంలో సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

చీపురుపల్లి: శ్రావణమాసం తొలి శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చీపురుపల్లి కనకమహాలక్ష్మి ఆలయంలో అర్చకులు అమ్మవారిని పసుపు కొమ్ములతో విశేషంగా అలంకరించారు. అమ్మవారికి మహిళలు కుంకుమ పూజలు చేశారు. దేవదాయశాఖ, ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరుకుమార్ నేతృత్వంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా తగి న ఏర్పాట్లు చేశారు. అలాగే చీపురుపల్లి పట్టణంలోని కస్పావీధి దుర్గాదేవి అమ్మవారి సన్నిధి, రామలింగాపురం గ్రామ సమీపంలోని మానసాదేవీ నాగశక్తి అమ్మవారి ఆలయంలో నిర్వహించిన కుంకుమ పూజల్లో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో..

జామి: శ్రావణమాసంలో మొదటి శుక్రవారం కావడంతో స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అమ్మవారిని చీరలతో అలంకరించారు. ఆర్యవైశ్య మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

మహాలక్ష్మిగా రాజరాజేశ్వరీదేవి దర్శనం

బొండపల్లి: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని దేవుపల్లిలోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ ప్రధాన అర్చ కులు దూసి శ్రీధర్ శర్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. జిల్లా నలమూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

సామూహిక కుంకుమ పూజలు

వేపాడ: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని బొద్దాం రామాలయంలో సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఆలయ అర్చకులు బొడ్డపాటి హరిశర్మ ఆధ్వర్యంలో గ్రామ మహిళలు పూజలు నిర్వహించారు.

శాకంబరిగా దుర్గమ్మ

శృంగవరపుకోట: స్థానిక దేవీచౌక్ వద్ద ఉన్న దుర్గాదేవి ఆలయంలో అమ్మవారు భక్తులకు శుక్రవారం శాకంబరిగా దర్శనమిచ్చారు. వందల సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి



సచివాలయ భవనం ప్రారంభోత్సవంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు,ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

- ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కడుబండి
- చంద్రబాబుకు అధికార పిచ్చిపట్టింది

కొత్తవలస: గ్రామాల అభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి, తద్వారా దేశాభివృద్ధి సాధ్యమని నమ్మి, గాంధీజి కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని రెల్లి గ్రామంలో రూ.90 లక్షలతో నిర్మించిన గ్రామసచివాలయ, రైతు భరోసా, హెల్త్ వెల్‌నెస్ కేంద్రాల భవనాలను ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుతో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ గతంలో మండల కేంద్రాల్లో రూ.50 లక్షలతో ప్రభుత్వ భవనం నిర్మించడమే గొప్ప విషయమని అన్నారు. ప్రస్తుతం ప్రతీ పంచాయతీలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సుమారు కోటి రూపాయలతో సచివాలయ, రైతుభరోసా, హెల్త్ వెల్‌నెస్ కేంద్రాల భవనాలను నిర్మించి, అందులో సిబ్బందిని నియమించి ప్రజలకు సేవలందిస్తున్నట్లు తెలిపారు. గతంలో ప్రభుత్వ సేవల కోసం ప్రజలు మండల కేంద్రాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ప్రస్తుతం ప్రజలకు ఆసేవలన్నీ గ్రామాల్లోనే అందుతున్నాయని చెప్పారు. టీడీపీ ప్రభుత్వంలో లంచాలు ఇచ్చిన వారికే పథకాలు అందేవని, ఈప్రభుత్వంలో ఎలాంటి సిఫార్సులు, లంచాలకు తావులేకుండా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్నామన్నారు. టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబుకు అధికార పిచ్చి పట్టుకుందన్నారు. గతంలో విజన్-2020 అని బూటకపు మాటలు చెప్పారని, మళ్లీ ఇప్పుడువిజన్- 2047 అంటున్నారని, ఆయన ఎన్ని చెప్పినా ప్రజలు నమ్మేస్థితిలో లేరని స్పష్టం చేశారు.రెల్లి గ్రామ సచివాలయం పరిధిలో రోడ్లు, తాగునీరు, విద్యుత్ సమస్యలను జిల్లా పరిషత్ నిధులతో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే కడుబండి మాట్లాడుతూ పథకాలు,అభివృద్ధి పనులు నిరాటంకంగా కొనసాగాలి అంటే 2024 ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీని గెలుపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, కొత్తవలస ఏఎంసీ చైర్ పర్సన్, వైస్ చైర్మన్ మూకల కస్తూరి, బొంతల వెంకటరావు, పీఏసీఎస్ చైర్మన్ గొరపల్లి శివ, రెల్లి,అప్పన్నదొరపాలెం సర్పంచ్‌లు అల్లం సత్యనారాయణ, జోడి రాములమ్మ, ఎంపీటీసీ ఉగ్గిన గురోజి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, నాయకులు మేలాస్త్రి అప్పారావు, గొరపల్లి రవికుమార్, పి.ఎస్.ఎన్.పాత్రుడు, పల్లా భీష్మ, ఉగ్గిన పద్మనాభం, గోపిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడే పోలింగ్

గంట్యాడ: పెంటశ్రీరాంపురం గ్రామంలో సర్పంచ్, వార్డు మెంబర్ స్థానానికి సంబంధించిన ఉప ఎన్నిక పోలింగ్ శనివారం నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట పోలింగ్ ఉంటుందని అధికారులు చెప్పారు. మధ్యాహ్న భోజన విరామం అనంతరం కౌంటింగ్ నిర్వహించి, ఫలితాలు వెల్లడిస్తారు. ఎన్నిక నిర్వాహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పోలింగ్ సామగ్రి, సిబ్బంది ఇప్పటికే గ్రామానికి చేరుకున్నారు.

దేవుపల్లిలో ..

బొండపల్లి: దేవుపల్లి గ్రామంలో 13వ వార్డు సభ్యుని ఎన్నికకు శనివారం పోలింగ్ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని ఎంపీడీఓ వై.వి.రాజేంద్ర ప్రసాద్ శుక్రవారం తెలిపారు. 223 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని చెప్పారు. పోలింగ్‌కు కావాల్సిన బ్యాలెట్ బాక్సులతో పాటు,సిబ్బంది అంతా దేవుపల్లి ఉన్నత పాఠశాలకు చేరుకున్నారని చెప్పారు. ఎస్టీఎఫ్ పోలీసులు 11 మంది, సివిల్ పోలీసులు 51 మందిని బందోబస్తుకు కేటాయించినట్లు ఎస్ఐ ఎస్.రవి తెలిపారు.

న్యాయవాదుల పరిరక్షణ చట్టం తీసుకురావాలి



నిరాహార దీక్ష చేస్తున్న న్యాయవాదులు

కొత్తవలస: న్యాయవాదుల పరిరక్షణ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే తీసుకురావాలని కొత్తవలస అడ్వకేట్ బార్‌అసోసియేషన్ డిమాండ్ చేసింది. స్థానిక మూడు రోడ్ల కూడలిలో కొత్తవలస అడ్వకేట్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం ఒక్కరోజు నిరాహార దీక్ష చేశారు. న్యాయవాదులకు ప్రముఖ వైద్యులు టి.సుబ్బారావు సంఘీభావం తెలిపారు. న్యాయవాదులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా న్యాయవాదులపై దాడులు, దౌర్జన్యాలు, బెదిరింపులు పెరిగిపోతుండడం ఆందోళనకు గురి చేస్తోందన్నారు. ఎంతోమంది న్యాయవాదులు హత్యకు గురయ్యారని, ఇలాంటి నేపథ్యంలో న్యాయవాదుల పరిరక్షణ చట్టాన్ని ప్రవేశపెట్టి ఆమోదించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. న్యాయవాదులు ఎం.వి.ఎస్.గిరిబాబు, గొడుగుల మహేంద్ర, మల్లా రాము, డి.శ్రీనివాసరావు, సీహెచ్.ఆర్.కె.ప్రసాద్, పి.కనకరావు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత



మాట్లాడుతున్న యోగి సదానందగిరి మహారాజ్

బొండపల్లి: రోజూ యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని, మానసిక ప్రశాంతత లభిస్తుందని పిరమిడ్ ధ్యానకేంద్రం వ్యవ స్థాపకుడు బ్రహ్మర్షి పత్రీజి శిష్యుడు యోగి సదానందగిరి మహారాజ్ అన్నారు. గొట్లాం గ్రామంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఆత్మజ్ఞాన ఆధ్యాత్మిక సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మట్లాడుతూ మారుతున్న కాలమాన పరిస్థితుల వల్ల ప్రజలు యాంత్రికజీవనం సాగిస్తున్నారని, దీని వల్ల రోగాల పాలవుతున్నారని అన్నారు. ఈసమస్యల నుంచి బయటపడాలంటే యోగా చేయడంతో పాటు, ఆధ్యాత్మిక కార్యక్రమాలపై మనస్సును లగ్నం చేయాలని సూచించారు. పిరమిడ్ సేవాదళ్ జిల్లా కన్వీనర్ వి.రామకృష్ణరాజు, అధ్యక్షులు జె.రామారావు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరిలో యాజమాన్యపద్ధతులపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

గజపతినగరం: వరి సాగులో యాజమాన్య పద్ధతులు, పంటను ఆశించే తెగుళ్లు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండలంలోని కొనిస, కొత్తబగ్గాం గ్రామాల్లో రైతులకు గజపతినగరం ఏడీఏ కె.మహరాజన్ శుక్రవారం అవగాహన కల్పించారు. నాట్లు వేసినప్పుడే కాలిబాటలు ఏర్పాటు చేసు కోవడం వల్ల సుడిదోమ ఉధృతిని నివారించవచ్చని సూచించారు. ప్రధానంగా ఉల్లి కోడు పురుగు నివారణకు కార్బోఫ్యూరాన్ గుళికలు లేదా ఫోరెట్ గుళికలు వేయాలని చెప్పారు.పైరజోసల్ఫ్యూరాన్ ఇథైల్, క్లోరి మురాన్ ఇథైల్‌ను పిచికారీ చేయడం వల్ల కలుపు నివారించవచ్చని అన్నారు. పొడ తెగులు నివారణకు ప్రొపికొనజోల్ లేదా హెక్సాకొనజోల్ పిచికారీ చేయాలని అన్నారు. కాటుక తెగులు నివారణకు ప్రొపికొనజోల్ వినియోగించాలని చెప్పారు. ప్రతీ పంటను ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏఓ గోవిందమ్మ, స్థానిక ఏఓ ధనలక్ష్మి, వీఏఏ భార్గవి తదితరులు పాల్గొన్నారు.

సామూహిక గృహప్రవేశాలకు సిద్ధం చేయండి



పురిటిపెంట జగనన్న లేఅవుట్‌ను పరిశీలిస్తున్న హౌసింగ్ ప్రత్యేక కార్యదర్శి దివాన్

గజపతినగరం: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను నెలాఖరులోగా పూర్తి చేయించి, లబ్ధిదారులను సామూహిక గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని హౌసింగ్ అధికారులకు ఏపీ హౌసింగ్ ప్రత్యేక కార్యదర్శి బి.ఎం.దివాన్ ఆదేశించారు. పురిటిపెంట జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. మండలంలో 1,426 ఇళ్లను సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని ప్రభుత్వ లక్ష్యం విధించిందని ఆయన చెప్పారు. 1,341 గృహ నిర్మాణాలు పూర్తయ్యాయని స్థానిక అధికారులు ఆయనకు చెప్పగా.. మిగతా గృహ నిర్మా ణాలను ఈనెలాఖరులోగా పూర్తి చేయించాలని ఆదేశించారు. హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, స్థానిక డీఈ ఎం.సత్యనారాయణ, ఏఈ సీహెచ్.సత్యనారాయణ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

రెన్యువల్‌కు దరఖాస్తు చేసుకోండి

చీపురుపల్లి: జిల్లాలోని ఆరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో కాంట్రాక్టు పద్ధతిపై విధులు నిర్వర్తిస్తున్న అధ్యాపకులు రెన్యువల్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఐడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వి.కృష్ణాజీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 19న సాయంత్రం 5 గంటలలోగా సంబంధిత కళాశాలల్లో రెన్యువల్ కోసం దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి 2023 మార్చి 31 నాటికి కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వర్తిస్తున్న అధ్యాపకులు మాత్రమే అర్హులని తెలిపారు.

విద్యార్థినులకు ఉపకార వేతనాలు



చీపురుపల్లి: విద్యార్థినులకు ఉపకార వేతనాలు అందజేస్తున్న బ్యాంక్ మేనేజర్ రాము, అసిస్టెంట్ మేనేజర్ పల్లవి



గుర్ల: విద్యార్థులకుమ ఉపకార వేతనాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు, బయోస్పాట్ కంపెనీ ప్రతినిధులు



కొత్తవలస: నగదు ప్రోత్సాహకాలు అందుకున్న విద్యార్థినులతో కెనరా బ్యాంకు మేనేజర్ శరణ్, ఉపాధ్యాయులు

చీపురుపల్లి/కొత్తవలస: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న షెడ్యూల్ కులాలు, తెగలకు చెందిన విద్యార్థినిలకు సీఎస్ఆర్ పథకంలో భాగంగా కెనరా విద్యా జ్యోతి పథకం పేరిట కెనరా బ్యాంకు ఉపకార వేతనాలు అందజేస్తోందని ఆ బ్యాంక్ చీపురుపల్లి, కొత్తవలస బ్రాంచ్ మేనేజర్లు ఏ.రాము, తీగెల శరణ్ చెప్పారు. చీపురుపల్లి బాలుర, కొత్తవలస ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం వేర్వేరుగా నిర్వహించిన కార్యక్రమాల్లో 12 మంది విద్యార్థినులకు నగదు అందజేశారు.

చీపురుపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో 5వ తరగతి నుంచి ఏడోతరగతి వరకు చదువుతున్న ముగ్గురు విద్యార్థినిలకు రూ.2,500 చొప్పున, 8 నుంచి పదో తరగతి వరకు చదువుతున్న ముగ్గురు విద్యార్థినిలకు రూ.5 వేల చొప్పున, కొత్తవలస ఉన్నత పాఠశాలలో న 6,7 తరగతులు విద్యార్థినులు టి.దీపిక, కె.కావ్యశ్రీ, కె.రామవర్ధిణికి రూ 2,500 చొప్పున, 8,9,10 తరగతులు చదువుతున్న బి.కుసుమ, కె.దుర్గా, ఎం.లిషకు రూ.5 వేలు చొప్పున అందజేశారు. చీపురుపల్లి సీనియర్ ఉపాధ్యాయుడు పి.వెంకటరావు పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆబ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ పి.పల్లవి, పీఎంసి చైర్మన్ కరణం ఆది, వైస్ చైర్‌పర్సన్ డి.దుర్గాదేవి, కొత్తవలసలో హెచ్ఎం సీహెచ్.ఈశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈఓ బి.శ్రీనివాసరావు ,బ్యాంక్ సిబ్బంది పి.భవాని,సిహెచ్.కుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బయోస్పాట్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో..

గుర్ల: మండలంలోని వల్లాపురం ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న పది మంది విద్యార్థుల కు బయోస్పాట్ ఇండియా లిమిటెడ్ విత్తనాలు,పురుగు మందుల కంపెనీ శుక్రవారం ఉపకార వేతనాలు అందించింది. గతేడాది 9వ తరగతిలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఎంపిక చేసి వారికి ఒక్కొక్కరికి రూ.2,500 నగదు అందజేశారు. అలాగే గ్రామంలోని ఆదర్శ రైతులను సత్కరించామని, ఆ కంపెనీ ప్రతినిధి సతీష్, రాంబాబు తెలిపారు. పాఠశాల సిబ్బంది, స్థానిక నేతలు పాల్గొన్నారు.

స్నేహభావంతో మెలగాలి



మాట్లాడుతున్న గరివిడి వెటర్నరీ కళాశాల అసోసియేట్ డీన్ శ్రీను

చీపురుపల్లిరూరల్(గరివిడి): కళాశాలల్లో విద్యార్థులు స్నేహభావంతో మెలగాలని, ర్యాగింగ్ వంటి కార్యకలాపాలకు దూరంగా ఉండాలని గరివిడి వెటర్నరీ కళాశాల అసోసియేట్ డీన్ మక్కేన శ్రీను సూచించారు. గరివిడి వెటర్నరీ కళాశాలలో శుక్రవారం 'యాంటీ రాగింగ్ వీక్' కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ అలవరుచుకుంటే ర్యాగింగ్ అనే ఆలోచన దరిచేరదన్నారు. శ్రీరామ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మజ్జి భాస్కరరావు మాట్లాడుతూ ర్యాగింగ్ నేరమని, ర్యాగింగ్‌కు పాల్పడి కేసుల్లో ఇరుక్కుని జీవితాన్ని నాశనం చేసుకోవద్దని అన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

పెదమానాపురంలో 'ఫ్యామిలీ డాక్టర్'

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం గ్రామంలో దత్తిరాజేరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. శిబిరంలో 62 మందికి వివిధ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం గృహసందర్శన చేసి దీర్ఘకాలిక వ్యాధులతో మంచంపై ఉన్న రోగులకు వైద్య తనిఖీలు చేసి మందులు అందజేశారు.

సుభాష్ చంద్రబోస్‌కు నివాళులు



నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న జెడ్పీటీసీ శ్రీనివాసరావు, ఎస్ఐ దామోదరరావు

చీపురుపల్లిరూరల్(గరివిడి): స్వాతంత్ర్య సమరయోధుడునేతాజీ సుభాష్ చంద్రబోస్‌ను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని గరివిడి జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, ఎస్ఐ ఎల్.దామోదరరావు అన్నారు. నేతాజీ వర్ధంతిని సహాయ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యం లో శుక్రవారం నిర్వహించారు. గరివిడి పట్టణంలోని సహాయ్ పార్క్ వద్ద ఉన్న నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడం లో సుభాష్ చంద్రబోస్ పాత్ర ఎంతో కీలకమైనదని అన్నారు. ఎస్ఎంఎస్ ఫెర్రోఎల్లాయిస్ పరిశ్రమ డైరెక్టర్ వాకాడ గోపి, నాయకులు ఉప్పు శ్రీను, బమ్మిడి కార్తీక్, బొంపల్లి వెంకటరావు, మజ్జి సంతోష్, బి.సీతారాం, సురేష్, శంకర్, ఉమామహేశ్వరరావు, శ్రీను,పి.శంకరరావు, అప్పారావు, రమణ,బెహరా పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తులాహ్వానం

శృంగవరపుకోట: ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ సింగిల్ సిట్టింగ్ ప్రవేశానికి దరఖాస్తులు స్వీక రిస్తున్నామని స్థానిక ఏ.వి.ఎన్. వొకేషనల్ జూనియ ర్ కళాశాల ఏఐ కో-ఆర్డినేటర్ సీహెచ్.ఈశ్వరరావు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో ప్రవేశాల్కు పదోతరగతి ఉత్తీర్ణులై, ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ టెన్త్ సర్టిఫికెట్‌తో పాటు ఆధార్ కార్డు, తండ్రి లేదా తల్లి ఆధార్‌కార్డు, కులధ్రువీకరణ పత్రాలు, దివ్యాంగులు అయితే వారి వైకల్య ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని పేర్కొన్నారు. అపరాద రుసుం లేకుండా ఈనెల 31 వ తేదీలోగా ప్రవేశం పొందవచ్చని తెలిపారు.

పాఠశాలలో తనిఖీలు

గజపతినగరం:స్థానిక ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలోఎంఈఓలు విమలమ్మ,బి.సాయిచక్రధర్ శుక్రవారం తనిఖీలు చేశారు. మధ్యాహ్నభోజనాలను రుచి చూశారు. విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు. అలాగే గజపతినగరం ఉన్నత పాఠశాలను సందర్శించి, పదోతరగతి వి ద్యార్థులకు సెల్ఫ్ టెస్ట్ పరీక్షల నిర్వహణను పరిశీలించారు.